RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శుక్రవారం । 28 । ఆగస్టు । 2026

# పీవీకే-5 మేనేజర్‌ను కలిసిన ఐఎన్‌టీయూసీ నేతలు

### - కార్మిక సమస్యలు పరిష్కరించాలని వినతి



**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
పీవీకే–5 గని కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, పిట్ సెక్రటరీ చిలకల రాజయ్య గని మేనేజర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గనిలో పని ప్రదేశాల్లో వెంటిలేషన్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వర్కర్స్ షెడ్లలో సరిపడా ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు మైన్ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలపై మేనేజర్ రవికిరణ్ సానుకూలంగా స్పందించి, సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఐఎన్‌టీయూసీ నేతలు తెలిపారు.

# బొగ్గు మైనింగ్‌లో కలిసి నడుద్దాం

**కర్ణాటక క్యాప్టివ్ బొగ్గు గనుల్లో జాయింట్ వెంచర్‌కు సింగరేణి సిద్ధం**
**కర్ణాటక ఇంధన శాఖ మంత్రికి ప్రతిపాదించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
**సానుకూలంగా స్పందించిన మంత్రి కె.జె. జార్జ్**





**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి)**
కర్ణాటక రాష్ట్రంలో చేపట్టిన క్యాప్టివ్ బొగ్గు గనుల్లో కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేపీసీఎల్)తో కలిసి జాయింట్ వెంచర్‌గా పనిచేయడానికి సింగరేణి సిద్ధంగా ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు గురువారం బెంగళూరులో కర్ణాటక ఇంధన శాఖ మంత్రి కె.జె. జార్జ్‌తో జరిగిన సమావేశంలో ప్రతిపాదించారు. రెండు రాష్ట్రాల మధ్య ఇంధన రంగ అభివృద్ధి, బొగ్గు సరఫరా, బొగ్గు కొనుగోళ్ల చెల్లింపులు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడిపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కర్ణాటక విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని క్యాప్టివ్ కోల్ బ్లాకుల్లో సింగరేణి అనుభవాన్ని వినియోగించుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. బొగ్గు మైనింగ్‌లో సింగరేణికి సుమారు 137 ఏళ్ల అనుభవం ఉందని, కేపీసీఎల్ చేపట్టిన ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని బొగ్గు బ్లాకుల్లో మైనింగ్ నిర్వహణకు సింగరేణి సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. అదే సమయంలో కర్ణాటకకు విద్యుత్ రంగంలో ఉన్న అనుభవాన్ని సింగరేణి భవిష్యత్ విద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో ఉపయోగించుకోవచ్చన్నారు. ఇరు రాష్ట్రాల ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని సూచించారు. ఈ ప్రతిపాదనపై కర్ణాటక మంత్రి కె.జె. జార్జ్ సానుకూలంగా స్పందించారు.

**కర్ణాటకకు నిరంతర బొగ్గు సరఫరా**
కర్ణాటకలో పారిశ్రామిక ప్రగతితో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నందున థర్మల్ పవర్ ప్లాంట్లకు తెలంగాణ నుంచి నిరంతరంగా బొగ్గు సరఫరా చేయాలని మంత్రి కె.జె. జార్జ్ కోరారు. దీనిపై భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందిస్తూ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కేటాయింపుల మేరకు బొగ్గు సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం సింగరేణి కర్ణాటక రాష్ట్రానికి ఏడాదికి మొత్తం 10.54 మిలియన్ టన్నుల బొగ్గును లింకేజీ ద్వారా సరఫరా చేస్తోంది. ఇందులో ఎర్రమారుస్ థర్మల్ పవర్ ప్లాంట్‌కు 5.24 మిలియన్ టన్నులు, రాయచూరు థర్మల్ పవర్ ప్లాంట్‌కు 3.01 మిలియన్ టన్నులు, బళ్లారి యూనిట్–3 థర్మల్ ప్లాంట్‌కు 2.29 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. రోజుకు కనీసం నాలుగు రేకుల ద్వారా బొగ్గు రవాణా జరుగుతోందని తెలిపారు. సమావేశంలో కర్ణాటక అడిషనల్ చీఫ్ సెక్రటరీ గౌరవ్ గుప్తా, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రసాద్ జ్యోతి, కేపీసీఎల్ ఎండీ రాజేంద్ర చోళన్, కేపీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ నాగరాజు, సింగరేణి ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యువతను విస్మరిస్తే పాలకులకు పతనం తప్పదు

### ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లాఖాద్రి






**కొత్తగూడెం, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
యువతను నిర్లక్ష్యం చేస్తే పాలకులకు పతనం తప్పదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లాఖాద్రి హెచ్చరించారు. గురువారం కొత్తగూడెంలోని సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిర్మాణ మహాసభ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి నానబాల బాలకృష్ణ జెండాను ఆవిష్కరించి సభలను ప్రారంభించారు.
ప్రతినిధుల సభలో వలిఉల్లాఖాద్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. ఏటా కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన పాలకులు యువతను విస్మరిస్తున్నారని విమర్శించారు. ఉపాధి కల్పనపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి నానబాల బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు శక్తులకు అప్పగిస్తూ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించే యువతపై నిర్బంధాలు సరికాదన్నారు. హక్కుల సాధనకు పోరాటాలే మార్గమని, యువత అధ్యయనం, ఉద్యమాలను అలవర్చుకుని సామాజిక మార్పు కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని బాలకృష్ణ స్పష్టం చేశారు.

# సింగరేణిలో అసలేం జరుగుతోంది?

**స్వయం ప్రతిపత్తి ఏమైపోతోంది.. రాజకీయ జోక్యానికి తాకట్టు పెడుతున్నారా?**
**ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలకు సింగరేణి ఉన్నతాధికారుల రాకపై కార్మిక వర్గంలో చర్చ**
**సంస్థ స్వయం ప్రతిపత్తిని కాపాడాలని ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ్ నాయక్ డిమాండ్**





**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
సింగరేణి సంస్థలో జరుగుతున్న పరిణామాలపై కార్మిక సంఘాలు, కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సంస్థకు చెందిన డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలకు వెళ్లి సమీక్షల్లో పాల్గొంటున్న తీరుపై పలువురు కార్మికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి స్వయం ప్రతిపత్తి సంస్థగా ఉన్న గౌరవానికి ఇది భంగం కలిగించే పరిణామమని వారు పేర్కొంటున్నారు. గతంలో సింగరేణి ఉన్నతాధికారులు ఎమ్మెల్యేలు, ఎంపీల క్యాంపు కార్యాలయాలకు వెళ్లి సంస్థ వ్యవహారాలపై సమీక్షలు నిర్వహించిన సందర్భాలు అరుదుగా ఉండేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయనే ప్రశ్నలు కార్మిక వర్గంలో వినిపిస్తున్నాయి. సంస్థ పరిపాలనలో రాజకీయ జోక్యం పెరుగుతోందా? సింగరేణి స్వయం ప్రతిపత్తి ఎటువైపు వెళ్తోంది? అనే చర్చ జరుగుతోంది.

**ఆర్థిక పరిస్థితిపైనా ఆందోళన**
సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సంస్థకు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, మరోవైపు సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గు, విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. సంస్థ ప్రయోజనాలను కాపాడాల్సిన యాజమాన్యం ఈ అంశాలపై మరింత కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు. సింగరేణి సంస్థను రాజకీయ జోక్యం నుంచి కాపాడాలని బీఎంఎస్ అనుబంధ ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ్ నాయక్ డిమాండ్ చేశారు. సంస్థ స్వయం ప్రతిపత్తిని పునరుద్ధరించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణి లక్షలాది కార్మిక కుటుంబాలకు జీవనాధారమని, సంస్థ భవిష్యత్తును కాపాడేందుకు కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సింగరేణి పరిరక్షణ, సంస్థ స్వయం ప్రతిపత్తి, కార్మికుల భవిష్యత్తు కోసం వాటాల పునర్వ్యవస్థీకరణపై ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ జోక్యాన్ని అడ్డుకుని కార్మికుల హక్కులను పరిరక్షించాలని మాధవ్ నాయక్ కోరారు.




# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: షబ్బీర్ అలీ



**కామారెడ్డి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
మాచారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాక్స్ చైర్మన్‌గా నౌసిలాల్ నాయక్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతులకు రుణాలు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలో పాక్స్ లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. నూతన పాలకవర్గం రాజకీయాలకు అతీతంగా రైతులందరికీ సమానంగా సేవలందించి పాక్స్ ను మరింత బలోపేతం చేయాలని కోరారు. మాచారెడ్డి మండల రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సురేష్ నర్సింగరావు, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యం

### - పీసీసీ అబ్జర్వర్ ఎం. లింగోజ



**కొత్తగూడెం, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పీసీసీ అబ్జర్వర్ ఎం. లింగోజి అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, చుంచుపల్లి మండలాల్లో గురువారం నిర్వహించిన ఎస్ఐఆర్ ఫేజ్––2 గ్రామసభల్లో ఆయన పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా లింగోజి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఫేజ్––2 ప్రక్రియలో బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గైర్హాజరు, వలస వెళ్లినవారు, మృతులు, డబుల్ ఓట్ల జాబితాలను పరిశీలించడంతో పాటు పేరు, వయస్సు, చిరునామాలో వ్యత్యాసాల కారణంగా నోటీసులు అందుకున్న అర్హులైన ఓటర్లను సంప్రదించాలని తెలిపారు. అర్హులైన ఓటర్లు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డంపెట్టుకుని అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే కుట్రలను సహించేది లేదని, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని లింగోజి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెదబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు మండే వీరహనుమంతరావు, పూణెం శ్రీనివాస్, బాల ప్రసాద్ పాసి, అంతడపుల కృష్ణ, నాగార్జున, ప్రజాప్రతినిధులు, వజ్జా. భాస్కర్, కేస్లీ, సాంబయ్య, జానీ, చావాల.పురుషోత్తం, బొల్లం.రమేష్, ఉబ్బన.రాజు, సెక్రటరీ లు, ప్రజాసంఘాల ప్రతినిధులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# యువశక్తిని నిర్వీర్యం చేయడం దుర్మార్గం




**ఉపాధి, ఉద్యోగ రంగాలను పాలకులు విస్మరిస్తున్నారు**
**ప్రశ్నించే గొంతుకలపై నిర్బంధాలు వీడాలి**
**పోరాటాలతోనే హక్కుల రక్షణ సాధ్యం : సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**

**కొత్తగూడెం, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
దేశ భవిష్యత్తుకు వెన్నెముకైన యువతను నిర్వీర్యం చేసే విధంగా పాలకుల విధానాలు కొనసాగుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా విమర్శించారు. ప్రభుత్వాలు ఉపాధి, ఉద్యోగ రంగాలను విస్మరించడంతో యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొం టోందన్నారు. రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణకు యువత ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు పాలకులు ప్రాధాన్యత ఇస్తున్నారని, ఫలితంగా సామాన్య ప్రజల జీవన పరిస్థితులు మరింత దుర్భరంగా మారుతున్నాయని విమర్శించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అణచివేతలపై యువత గళమెత్తాలని సూచించారు. కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, ఏఐవైఎఫ్ నిర్మాణ బాధ్యులు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ యువత తమ సైద్ధాంతిక, పోరాట శక్తిని పెంపొందించుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండాలని కోరారు. యువజన సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కల్లూరి వెంకటేశ్వరరావు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు ఇటికల రామకృష్ణ, సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, వి.పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే ఫహీమ్, ఖయూమ్, భూపేష్, జర్పుల ఉపేందర్, అనుముల సాయి తదితరులు పాల్గొన్నారు.

# కడుపునొప్పి భరించలేక వృద్ధురాలి మృతి

**హసన్‌పర్తి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంటురుపల్లి గ్రామానికి చెందిన పప్పు సరోజన (80) కడుపునొప్పి భరించలేక పురుగుల మందు సేవించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 26న ఇంట్లో అపస్మారక స్థితిలో కనిపించడంతో కుటుంబ సభ్యులు ఆమెను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందారు. కుమారుడి ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శుక్రవారం । 28 । ఆగస్టు । 2026

# ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

**- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా**



**కొత్తగూడెం, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక, న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు నిర్వహించిన మహాధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. 2వ పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించేలా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు పూర్తిస్థాయి ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం జరిగే పోరాటాలకు సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# అధిక వడ్డీలు, ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

**- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్**



**కొత్తగూడెం, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):** అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి ప్రజలను వేధించే వారితో పాటు ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ హెచ్చరించారు. రుణం తీసుకునే ముందు వడ్డీ, తిరిగి చెల్లింపు నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలని ప్రజలకు సూచించారు. ఉద్యోగాల పేరుతో ముందస్తుగా డబ్బులు చెల్లించవద్దని, ఉద్యోగ వివరాలను సంబంధిత సంస్థల అధికారిక మార్గాల ద్వారా నిర్ధారించుకోవాలని నిరుద్యోగులకు సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, సోషల్ మీడియా ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. అధికవడ్డీలవసూళ్లు, ఉద్యోగాల పేరుతో మోసాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలి

**- విద్యారంగాన్ని బలోపేతం చేయాలి: సీపీఎం**





**తల్లాడ, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):** ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సర్వేలో పలు సమస్యలు వెలుగుచూశాయని తెలిపారు. మండలంలోని పాఠశాలల్లో 46 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఎంఈఓతో పాటు కార్యాలయ సిబ్బంది పోస్టులు కూడా భర్తీ చేయాల్సి ఉందన్నారు. ప్రధాన పాఠశాలల్లో విద్యార్థుల భద్రత కోసం వాచ్‌మెన్ పోస్టులు మంజూరు చేయాలని, మూతపడిన నాలుగు పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని కోరారు. సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపట్టాలని, మరుగుదొడ్లు, ఆటస్థలాలు, పాఠశాల పరిసరాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. పాఠశాలల వద్ద కోతులు, కుక్కల సంచారం నివారించి విద్యార్థుల భద్రత కోసం ప్రహరీల వద్ద సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి, మౌలిక వసతులు కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో సీపీఎం తల్లాడ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, సత్తెనపల్లి నరేష్, కళ్యాణపు కృష్ణయ్య, అనుమూల కృష్ణయ్య, పులి వెంకట నరసయ్య, దారెల్లి కృష్ణ, కట్టా దర్గయ్య, ఐలూరు కోటిరెడ్డి, ఐలూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలి

**- జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే. సీతారామయ్య**





**కొత్తగూడెం, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):** ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి పరిరక్షణ కోసం కార్మిక సంఘాలు, కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే. సీతారామయ్య పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెం ఏరియాలోని వెంకటేశ్‌ఖనిలో జీఎల్‌బీకేఎస్ ఫిట్ సెక్రటరీ కాపు కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి పరిరక్షణ, నూతన బొగ్గు గనుల సాధన, కార్మికుల సమస్యలు, మెడికల్ బోర్డు ఏర్పాటు, లాభాల బోనస్ తదితర అంశాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బొగ్గు గనుల అమ్మకాలు సంస్థ భవిష్యత్తుకు, ఉద్యోగ భద్రతకు ప్రమాదకరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను రాబట్టడంతో పాటు నూతన గనులు, ఉద్యోగాల సాధనకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరుగుతోందని సీతారామయ్య ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మరింత చొరవ చూపాలని సూచించారు. మెడికల్ బోర్డు, గైర్హాజరు, మారుపేర్లతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2026 సంవత్సరానికి లాభాల బోనస్‌ను వెంటనే ప్రకటించి కార్మికులకు 40 శాతం, కాంట్రాక్ట్ కార్మికులకు 15 శాతం బోనస్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీఎల్‌బీకేఎస్ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి గందూరి సంజీవరావు, గౌని నాగేశ్వరరావు, ఎండీ అలీముద్దీన్, సంజీవ్, కొండల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలపై యువ మోర్చా ఆగ్రహం

**- అమరవీరుల స్థూపం వద్ద రాస్తారోకో**





**కొత్తగూడెం, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):** విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం అమరవీరుల స్థూపం, బస్టాండ్ సెంటర్ వద్ద నిరసన, రాస్తారోకో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు జుజ్జూరు మోహన్ కృష్ణ నాయకత్వం వహించారు.
ఈ సందర్భంగా మోహన్ కృష్ణ, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జాటోత్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల కారణంగా వేలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, రాష్ట్ర విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలను వెంటనే చెల్లించకపోతే జిల్లావ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిఎల్ బికేఎస్ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి గండూరి సంజీవరావు, గౌని నాగేశ్వరరావు, ఎండీ .అలీముద్దిన్, సంజీవ్, కొండల్, ప్రసాద్, బీజేపీ, యువ మోర్చా, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెట్లే మానవాళికి జీవనాధారం

**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**తిరుమలాయపాలెం, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):** మానవాళి మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు చెట్లే ప్రధాన జీవనాధారమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామంలో నిర్వహించిన వనమహోత్సవంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను చెట్టుగా మారే వరకు గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది బాధ్యతగా కాపాడాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించి ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహశీల్దార్ విల్సన్, ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నీరన్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి

**- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



**వైరా, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):** వైరా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, రోడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీరు, పౌర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, ఆర్థిక పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.
మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, తడి, పొడి చెత్త సేకరణను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఇంటి పన్నులు, బకాయిలను 100 శాతం వసూలు చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ సొంత ఆదాయ వనరులను పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వార్డులో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రోడ్లు, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వైరా రిజర్వాయర్ సమీపంలోని డంపింగ్ యార్డ్ స్థలాన్ని, నిరుపయోగంగా ఉన్న మత్స్యశాఖ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్,వైరా మున్సిపల్ కమీషనర్ రామచంద్ర రావు,తహసీల్దారు సురేష్,మున్సిపల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు..

# ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి

**- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్**





**తల్లాడ, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు కృషి చేయాలని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ సూచించారు. గురువారం తల్లాడ మండలంలో పర్యటించిన ఆయన ముందుగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా తొలిసారి పార్టీ కార్యాలయానికి వచ్చిన నూతి సత్యనారాయణ గౌడ్‌ను నాయకులు సన్మానించారు. అనంతరం మల్లారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో 3,552 మంది ఓటర్లు ఉండగా, 507 మంది ఓటర్లకు పేర్ల నమోదు, వివరాల సవరణకు సంబంధించి నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లు ధనకొండ నరసింహారావు, కటికి శ్రీరామమూర్తి, భూక్య అంజయ్యలకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బూత్ స్థాయి ఏజెంట్లు బాధ్యతగా పనిచేయాలని, ఎన్నికల సంఘం సూచించిన పత్రాలను సమర్పించేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మీరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, కోసూరు వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ ఎం.తల్లా ప్రసాద్, వెంకటరమణారెడ్డి, ఉప సర్పంచ్ యశోదతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీసీసీ జిల్లా మీడియా అధ్యక్షుడు ప్రసాద్‌కు సన్మానం



**తల్లాడ, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):** తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) జిల్లా మీడియా అధ్యక్షుడిగా ఎన్నికైన నారపోగు ప్రసాద్‌ను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ గురువారం సన్మానించారు. తల్లాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రసాద్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రసాద్ టీసీసీ జిల్లా మీడియా అధ్యక్షుడిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య మీడియా వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. తనను సన్మానించిన నూతి సత్యనారాయణ గౌడ్‌కు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మీరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కోసూరు వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ ఎం. ప్రసాద్, వెంకటరమణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్, తుమ్మలపల్లి రమేష్, దాసరి శ్రీనివాసరావు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు రక్షా బంధన్ శుభాకాంక్షలు : కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిజామాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)** సోదర సోదరీమణుల ఆత్మీయ బంధానికి ప్రతీకైన రక్షా బంధన్ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ భవేష్ మిశ్రా శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగను ప్రజలంతా సోదరభావం, సౌభ్రాతృత్వంతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. సోదరీమణులకు అండగా నిలుస్తామనే భరోసాను సోదరులు కల్పించడం ఈ పండుగ ప్రత్యేకత అన్నారు. రాఖీ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తుందని, మహిళల భద్రత, గౌరవం ప్రాధాన్యతను చాటుతుందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రేమ, మానవత్వం, ఆత్మీయతను పెంపొందించే రక్షా బంధన్ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.

# బొల్లారం గ్రామంలో ప్రత్యేక ఎస్ఐఆర్‌పై గ్రామసభ



**ఎల్లారెడ్డి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):** బొల్లారం గ్రామంలో ప్రత్యేక ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సవరణ)పై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా అభ్యంతరాలు ఉన్న ఓటర్ల జాబితాను గ్రామసభలో చదివి వినిపించారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్దిగారి ప్రభు గౌడ్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, జీపీఓ లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి: కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిజామాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని, పేరు, వయస్సు తదితర వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసులు అందిస్తున్న తీరును గురువారం నిజామాబాద్ నగరంలోని 19వ డివిజన్ కంటేశ్వర్‌లో కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు అందించిన నోటీసులు, పెండింగ్‌లో ఉన్నవి, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధృవీకరణ అవసరమైన ఓటర్లకు నేరుగా నోటీసులు అందించాలని, అవసరమైతే మరోసారి నోటీసు ఇవ్వాలని సూచించారు. ఓటర్లు ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే వాటిని స్వీకరించాలని, నిర్ణీత గడువులో ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పక పాటించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బీ.ఎల్.ఓ సూపరింటెండెంట్ మురళి, బీ.ఎల్.ఓ లావణ్య తదితరులు ఉన్నారు.

## ఒక కెమెరా 100 కళ్ళతో సమానం

**మాదాపూర్ గ్రామంలో 21 సీసీటీవీ కెమెరాల ప్రారంభం**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఇచ్చోడ, ఆగస్టు : 27 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఇచ్చోడ మండలం మాదాపూర్ గ్రామంలో గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన 21 సీసీటీవీ కెమెరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న జిల్లా ఎస్పీకి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. యువత గంజాయికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామంలో అన్ని మతాల ప్రజలు పరస్పరం సోదరభావంతో, ఐకమత్యంగా ఉంటూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే , ఇచ్చోడ ఎస్‌హెచ్ఓ కె. నరేష్ కుమార్, గ్రామ సర్పంచ్ షేక్ ఇమ్రాన్, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జీవో 97ను వెంటనే రద్దు చేయాలి

**పాలిటెక్నిక్ విద్యను స్వతంత్రంగా కొనసాగించాలి**

**బీఆర్ఎస్ నేత అయిలేని మల్లికార్జున్‌రెడ్డి**



**హుస్నాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
పాలిటెక్నిక్ విద్యార్థులకు నష్టం కలిగించే జీవో నంబర్ 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జీవో 97ను రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థులు పది రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. గతంలో పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందే అవకాశం ఉండేదని, కొత్త నిబంధనలతో ప్రవేశానికి పరీక్ష రాయాల్సి వస్తోందని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, అయితే విద్యార్థులకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యను స్వతంత్రంగా కొనసాగిస్తూ జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పిసర సత్యనారాయణరావు, అయిలేని గాల్‌రెడ్డి, మేకల వికాస్‌యాదవ్, నాంపల్లి శంకర్, గుగులోతు తిరుపతినాయక్, ఇరుగు రమేష్, మాటూరి రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

**జగిత్యాల, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



రాఖీ పౌర్ణమి సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, కో-ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, నాయకులు సమీండ్ల శ్రీనివాస్, శరత్ రావు, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించే జర్నలిస్టులే రోడ్డెక్కాల్సిన పరిస్థితి

**- జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి**






**తల్లాడ, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులే తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీపీఎం నాయకుడు అయినాల రామలింగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం వెంటనే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర గురువారం సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండల కేంద్రానికి చేరుకుంది. నవతెలంగాణ రిపోర్టర్ ముస్తఫా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జర్నలిస్టులు పాదయాత్ర చేపట్టి తహసీల్దార్ కరుణాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మండల కేంద్రంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. తహసీల్దార్ కరుణాకర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన సభలో తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు బి.శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు చల్లా నాగులు మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇళ్ల స్థలాలతో పాటు భద్రత, ఆరోగ్య కార్డులు, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాజశేఖర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ ఖదీర్, జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు నలబోల మధుశ్రీ, రాష్ట్ర ఈసీ సభ్యుడు టి.ఎస్.చక్రవర్తి, సీనియర్ జర్నలిస్ట్ మారెడ్డి నాగేందర్‌రెడ్డి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరికొప్పుల రాంబాబు, భూక్య గణేష్, అర్షద్, గంగుల గోపి, మందా శరత్, చిర్రా పవన్, పెరుమాళ్లపల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు, పెన్షనర్లకు నూతన పీఆర్సీ ప్రకటించాలి

**- ఈహెచ్ఎస్‌ను వెంటనే అమలు చేయాలి: టీజీఈ జేఏసీ**



**కరీంనగర్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి నూతన పీఆర్సీని ప్రకటించాలని కరీంనగర్ జిల్లా టీజీఈ జేఏసీ డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ జేఏసీ పిలుపు మేరకు దారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ.. జూలై 2023 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని వెంటనే ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్‌ను అన్ని జిల్లా కేంద్రాల్లో తక్షణమే అమలు చేయాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడంతో పాటు పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఏపీఆర్ఏ హుజూరాబాద్ అధ్యక్షుడు భారత ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, బాధ్యులు బొంగోని వెంకటయ్య, చొల్లేటి మల్లారెడ్డి, మండల వీరస్వామి, గౌరిశెట్టి సాంబయ్య, తాటిపాముల కనకయ్య, గాజర్ల బుచ్చిరాజం, పెదపాటి రమేష్, తిరునగరి రమేష్, పరాంకుశం సనత్ కుమార్, నల్లా రాజిరెడ్డి, చాడ సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మారపల్లి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



**జమ్మికుంట, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అంబేద్కర్ విగ్రహ కమిటీ చైర్మన్ మారపల్లి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, రక్షణ భావనలను పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు భావితరాలకు కుటుంబ విలువలను అందించడంలో దోహదపడతాయని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు రక్షాబంధన్ పండుగ విశిష్టత, కుటుంబ బంధాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ ముద్దమల్ల రవి, పోతుల శ్రీనివాస్, బుర్ర సంపత్ గౌడ్, గడ్డం రమేష్, నెల్లి అశోక్, ఎం.డీ. ముస్తఫా, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణకు 'ఎస్ఐఆర్' ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

**వేములవాడ అర్బన్ తహసీల్దార్ జయంత్‌కుమార్**



**వేములవాడ, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి గ్రామంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై గురువారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ రెడ్డవేణి పరశురామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ జయంత్‌కుమార్, ఆర్ఐ శ్రీధర్ పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా పూర్తి చేసేందుకు గ్రామస్థులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బీఎల్ఓల నుంచి నోటీసులు అందుకున్న వారు గ్రామ పంచాయతీ కార్యాలయానికి హాజరై తమ వివరాలను పరిశీలించుకోవాలని సర్పంచ్ పరశురామ్ కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్, వార్డు సభ్యులు రాధ, రాజు, మమత, అజీజ్, బీఎల్ఓలు, బీఎల్ఏలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భూ రీ-సర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



**నారాయణఖేడ్, మానూర్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భూ రీ-సర్వే పనులను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా, పారదర్శకంగా నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం మానూర్ మండలం గట్ లింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల కొలతలు, హద్దుల నిర్ధారణ, భూ వివరాల నమోదు ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో రీ-సర్వే ప్రక్రియను నిర్ణీత నిబంధనల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి, డిప్యూటీ కలెక్టర్ ప్రతిభాశేఖర్, సర్వే ల్యాండ్ ఏడీ, మానూర్ తహసీల్దార్ విష్ణుసాగర్, ఆర్ఐ శంకర్‌రెడ్డి, సర్వేయర్ సుమలత, జూనియర్ అసిస్టెంట్ ఖాజా మొయినుద్దీన్, ఉప సర్పంచ్ ప్రతిభ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ

**కేజీబీవీలో 'మదర్ ట్రీ' ఏర్పాటు..**

**వృక్ష రాఖీ వేడుకలు**



**రాయికల్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) ఆధ్వర్యంలో ఉప్పుమడుగు కేజీబీవీలో గురువారం మొక్కల ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో 'మదర్ ట్రీ'ను ఏర్పాటు చేశారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని విద్యార్థినులు ఆకులు, పూలతో రాఖీలు తయారు చేసి పాఠశాలలోని మొక్కలు, చెట్లకు కట్టి 'వృక్ష రాఖీ' వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎన్. శోభారాణి మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, విద్యార్థి దశ నుంచే మొక్కల పెంపకంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## వివాహ వేడుకకు హాజరైన పింగిలి రమేష్



**జమ్మికుంట, ఆగస్టు 27,(తెలంగాణ వాణి ప్రతినిధి)**
మండలంలోని నాగంపేటలో గల సౌభాగ్యలక్ష్మి గార్డెన్‌లో వావిలాల గ్రామానికి చెందిన బొడ్డుపల్లి సంపత్ సోదరుడి వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం వధూవరుల కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫా మోడల్ పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్, జన్మదిన వేడుకలు



**డిండి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి మండల కేంద్రంలోని ఆల్ఫా మోడల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు భారతి ఆధ్వర్యంలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షాబంధన్ విశిష్టత, అన్నాచెల్లెళ్ల అనుబంధం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల విద్యార్థి తెడ్లపల్లి అస్మిత్ వెంకట్రావు జన్మదిన వేడుకలను నిర్వహించారు. తల్లిదండ్రులు సంపత్‌రావు, స్వర్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్, సినీ, లింగమయ్య, భార్గవి, మహర్జన, సంధ్య, లక్ష్మి తదితరులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శుక్రవారం । 28 । ఆగస్టు । 2026

## మామిడిపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



**రాయికోడ్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం మామిడిపల్లి గ్రామంలో కత్తేర విట్టల్--లక్ష్మి దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాలాజీ నర్సిములు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నజీర్ పటేల్ తదితరులు పాల్గొని రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటి లబ్ధిదారులు మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీరభద్రేశ్వర ఆలయ చైర్మన్ సతీష్ కులకర్ణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్, నాయకులు శివకుమార్, మారుతి, గుమ్మడి శ్యామ్, ఆఫీస్ పటేల్, మౌలా, ఆశం, యూనుస్, దౌలత్, ఇస్మాయిల్, మొయిన్, అజీమోద్దీన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ కుటుంబ విలువలకు ప్రతీక...రాఖీ

సోదర--సోదరీ బంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగ కేవలం ఒక సంప్రదాయ వేడుక కాదు. ప్రేమ, ఆప్యాయత, బాధ్యత, రక్షణ అనే విలువలను గుర్తుచేసే ప్రత్యేక సందర్భం. భారతీయ సంస్కృతిలో పండుగలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రతి పండుగ వెనుక ఒక సామాజిక సందేశం, ఒక కుటుంబ విలువ, ఒక మానవీయ భావన దాగి ఉంటుంది. అలాంటి పండుగల్లో రాఖీ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలను మరింత బలపరిచే ఈ పర్వదినం కుటుంబ బంధాల గొప్పతనాన్ని చాటుతుంది.

రాఖీ కట్టడం అంటే కేవలం సోదరి సోదరుడి చేతికి ఒక దారం కట్టడం కాదు. తన సోదరి పట్ల ప్రేమ, గౌరవం, బాధ్యతను సోదరుడు గుర్తుచేసుకోవడం, తన సోదరుడి పట్ల ఆప్యాయత, నమ్మకం, శుభాకాంక్షలను సోదరి వ్యక్తం చేయడం. కాలం మారినా, జీవన విధానాలు మారినా ఈ బంధంలోని ఆత్మీయత మాత్రం తరతరాలకు కొనసాగుతోంది. అయితే ఆధునిక జీవనశైలిలో కుటుంబ బంధాలు క్రమంగా దూరమవుతున్నాయన్న ఆందోళన ఉంది. ఉద్యోగాలు, విద్య, వలసలు, పట్టణ జీవనం కారణంగా అన్నాచెల్లెళ్లు వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. సోషల్ మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా అనుబంధం కొనసాగుతున్నప్పటికీ ప్రత్యక్షంగా కలుసుకుని ఆప్యాయతను పంచుకునే సందర్భాలు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో రాఖీ వంటి పండుగలు బంధాలను మళ్లీ దగ్గర చేసే అవకాశాలుగా మారాలి. రాఖీ పండుగ సందేశాన్ని కేవలం 'రక్షణ' అనే భావనకే పరిమితం చేయకూడదు. నేటి సమాజంలో సోదరుడు సోదరికి రక్షణగా నిలవడంతో పాటు, సోదరి కూడా సోదరుడికి ధైర్యం, మానసిక బలం, మార్గదర్శకత్వం అందించే స్థాయికి బంధం ఎదగాలి. పరస్పర గౌరవం, సమానత్వం, బాధ్యతలే ఆధునిక కుటుంబ బంధాలకు పునాది కావాలి. అదేవిధంగా మహిళల భద్రత, గౌరవం కుటుంబం నుంచే ప్రారంభం కావాలి. ప్రతి బాలికకు విద్య, స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం కల్పించడం, ప్రతి మహిళను సమానంగా గౌరవించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. రాఖీ సందర్భంగా సోదరుడు ఇచ్చే హామీ మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలి. పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ పండుగను అనుసంధానించవచ్చు. ప్లాస్టిక్‌తో తయారైన రాఖీలకు బదులుగా పర్యావరణహిత రాఖీలను ప్రోత్సహించడం, స్థానిక కళాకారులు తయారు చేసే రాఖీలను కొనుగోలు చేయడం ద్వారా సంప్రదాయంతో పాటు సామాజిక బాధ్యతను కూడా ముందుకు తీసుకెళ్లవచ్చు. రాఖీ పండుగ కుటుంబ సభ్యుల మధ్య ప్రేమను పునరుద్ధరించే రోజు మాత్రమే కాకుండా, సమాజంలో పరస్పర విశ్వాసం, గౌరవం, మానవీయతను పెంపొందించే సందర్భంగా మారాలి. రక్తసంబంధం ఉన్నవారే కాదు.. ఆపదలో అండగా నిలిచే ప్రతి బంధం విలువైనదే. రాఖీ చేతికి కట్టే దారం చిన్నదే కావచ్చు.. కానీ అది గుర్తుచేసే బంధం మాత్రం జీవితాంతం నిలిచేది. ప్రేమను పంచుకుందాం.. బంధాలను బలపరుచుకుందాం.. పరస్పర గౌరవంతో సమాజాన్ని మరింత మానవీయంగా తీర్చిదిద్దుదాం. అదే రాఖీ పండుగకు అసలైన అర్థం.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజిక వేత్త, విశ్లేషకులు.
సెల్ : 9949194327

## తిరుపతి గౌడ్ కుటుంబానికి కౌశిక్ హరి పరామర్శ



**పెద్దపల్లి: ఆగస్టు, 27(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం పుట్నూరు గ్రామంలో బత్తిని తిరుపతి గౌడ్ అనారోగ్యంతో మృతి చెందారు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ట్లాక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు కౌశిక్ హరి అత్యంత ప్రధాన అనుచరుడైన బత్తిని సతీష్ గౌడ్ బాబాయ్ తిరుపతి గౌడ్ కావడంతో సమాచారం అందిన వెంటనే గురువారం పుట్నూరు గ్రామానికి వెళ్లి తిరుపతి గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు.

## రాఖీ పండుగ సోదరభావానికి ప్రతీక

### జనసేన తెలంగాణ అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాస్ రావు

**కొత్తగూడెం, ఆగస్టు 27 (తెలంగాణ వాణి)**



రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు జనసేన పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాస్ రావు శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ సోదరభావం, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అక్కా చెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీ కట్టి జీవితాంతం తమకు అండగా ఉండాలని కోరుకోవడం భారతీయ సంప్రదాయంలో ప్రత్యేకమైన ఆత్మీయతకు నిదర్శనమన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా రక్షాబంధన్‌ను జరుపుకోవడం దేశ ఐక్యత, సోదరభావాన్ని చాటుతుందని పేర్కొన్నారు. ఈ పండుగ కుటుంబ బంధాలను బలోపేతం చేయడంతో పాటు ప్రజల్లో పరస్పర గౌరవం, మానవత్వం, జాతీయ స్ఫూర్తిని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.